

దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను సోమవారం పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డిని గాంధీ దవాఖాన వద్ద అరెస్ట్ చేస్తున్న పోలీసులు



గాంధీ హాస్పిటల్‌లో దీక్ష చేస్తున్న మోతీలాల్‌కు సంఘీభావం తెలిపేందుకు ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు భారీ ర్యాలీ తీస్తున్న నిరుద్యోగులు



ఓయూలో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# నిరుద్యోగుల రణభేరి

మొదటిపేజీ తరువాయి...

నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూనే 8 రోజులుగా ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న మోతీలాల్ నాయక్‌ను పరామర్శించేందుకు ప్రజాప్రతినిధులు, నిరుద్యోగులు, నిరుద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నిరుద్యోగ సంఘం నాయకుడు బక్క జడ్సన్, బీఆర్‌ఎస్వీ ఓయూ విద్యార్థి నాయకుడు అవినాశ్‌తోపాటు పలు విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నాయకులు మోతీలాల్‌ను పరామర్శించేందుకు గాంధీ దవాఖానకు చేరుకోగా, వారిని మెయిన్‌గేట్ వద్దనే పోలీసులు అడ్డుకుని, అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఎమ్మెల్యే పల్లా అనుచరులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కొందరు విద్యార్థి నాయకులకు, పోలీసులకు మధ్య జరిగిన వాగ్వాదంలో పలువురు గాయపడ్డారు. మీడియా ప్రతినిధులతో కూడా చిలకలగూడ పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఫొటోలు, వీడియోలు తీయకుండా అడ్డుకున్నారు. మీడియా కవరేజీ కోసం వెళ్తామని చెప్పినా దవాఖానలోకి అనుమతించలేదు.

## అట్టుడికిన ఓయూ

మోతీలాల్‌నాయక్‌కు మద్దతుగా విద్యార్థులు ఆందోళనకు దిగడంతో ఉస్మానియా యూనివర్సిటీలోనూ ఉద్రిక్తత నెలకొన్నది. మెయిన్ లైబ్రరీ నుంచి విద్యార్థులు ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడే బైఠాయించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనచేస్తున్న విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితికి నైతిక బాధ్యత వహిస్తూ.. బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ప్రొఫెసర్ కోదండరాం క్షమాపణ చెప్పాలని అన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఓయూ వేదికగా వేలాదిమందితో నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జంగయ్య, కార్తీక్, వినోద్, హనుమంతు, సతీశ్, శివ, లింగ, సుభాష్, శ్రీను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల తీరు దుర్మార్గం: పల్లా

**మోతీలాల్** డిమాండ్లన్నీ న్యాయమైనవేనని, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. మోతీలాల్‌ను పరామర్శిస్తే తప్పేమిటని, తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పోలీసులు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణ ఉద్యమంలో కూడా ఇంత దారుణం చూడలేదని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఇవ్వడానికి ప్రభుత్వానికి సమస్య ఏమిటని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఏపీ సీఎం చంద్రబాబుకు అనుకూలంగా పని చేస్తున్నదనే అనుమానం కలుగుతున్నదని చెప్పారు. మోతీలాల్ నాయక్‌ను పరామర్శించడానికి ఒక్క మంత్రికి కూడా తీరిక లేదా? అని ప్రశ్నించారు.



ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్‌లోని మెట్టుగడ్డ వద్ద ధర్నా చేపడుతున్న నిరుద్యోగులు

## బడంగ్‌పేటలో బల్మూరి దిష్టిబొమ్మ దగ్ధం

ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పలువురు నిరుద్యోగులు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ముందు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గాంధీలో దీక్ష కొనసాగిస్తున్న మోతీలాల్‌కు ఏమైనా జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతామని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## చిక్కడపల్లి సిటీ లైబ్రరీలో నిరసన

మోతీలాల్‌నాయక్‌కు మద్దతుగా చిక్కడపల్లి నగర గ్రంథాలయంలో నిరుద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి సిటీ లైబ్రరీ నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల అండదండలతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలలైనా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కోదండరాం పదవిని ఆశించి నిరుద్యోగులకు గురించి మాట్లాడకుండా, ఇంట్లో కూర్చున్నారని మండిపడ్డారు.



జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ ఎదుట బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

## సీఎం రేవంత్ చర్చలు జరపాలి: బీసీ జనసభ



**35 లక్షల** మంది నిరుద్యోగుల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మోతీలాల్ నాయక్ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులతో చర్చలు జరపాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

## రేవంత్ రాజీనామా చేయాలి : బక్క జడ్సన్



**ఉద్యోగ** నోటిఫికేషన్లపై మాట నిలుపుకోని రేవంత్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పనికిమాలిన, అవగాహన లేని, 420 ముఖ్యమంత్రి అంటూ విమర్శించారు. నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్ల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎక్కడకు పోయాడని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలే గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రశ్నపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు.



సూర్యాపేటలో ప్రధాన రహదారిపై ప్లకార్డులతో ధర్నా నిర్వహిస్తున్న నిరుద్యోగులు

# నిర్బంధంలో మోతీలాల్

**'గాంధీ'లో భారీగా పోలీసుల మోహరింపు.. 8వ రోజుకు చేరిన ఆమరణ దీక్ష**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 1 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్: అది లక్షలాది మందికి ప్రాణం పోసిన దవాఖాన.. నిత్యం వందలాది మంది పేదలకు ఉచిత వైద్యసేవలందించే వర ప్రదాయిని.. కానీ, నేడు పోలీసుల బూట్ల చప్పుళ్ల నడుమ బందీఖానగా మారింది.. ఏ ఒక్కరినీ లోనికి వెళ్లనీయని జైలు గోడల్లా పోలీసుల వలయం ఆవరించింది.. పోలీసుల దమనకాండకు పరాకాష్ఠగా నిలిచింది.. రాష్ట్ర రాజధాని నగర పరిధిలోని గాంధీ దవాఖాన వద్ద నెలకొన్న అమానవీయ పరిస్థితికి అద్దంపడుతున్నది. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్‌నాయక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న గాంధీ దవాఖాన నిర్బంధంలోకి వెళ్లిపోయింది. మోతీలాల్‌ను పరామర్శించేందుకు ఏ ఒక్కరినీ వెళ్లనీయకుండా పోలీస్ కంచె పహారా కాస్తున్నది. దవాఖాన పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పరిసరాల్లో ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులను దరిదాపుల్లో లేకుండా తరలించేస్తున్నారు. కనీసం మీడియాను సైతం మోతీలాల్ వైపు వెళ్లనీయకుండా అడ్డుగోడల్లా నిలిచారు. ప్రజాస్వామ్యయుతంగా ఓయూలో దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను తొలుత పోలీసులు గాంధీ దవాఖానకు తరలించారు. పట్టువీడకుండా ఆయన దీక్షను అక్కడే కొనసాగిస్తున్నారు. మోతీలాల్‌కు సంఘీభావం తెలిపేందుకు విద్యార్థి, నిరుద్యోగ, రాజకీయ తదితర పక్షాల నేతలు దవాఖాన వద్దకు తరలివస్తున్నారు. వారంపాటు మోతీలాల్ దీక్షను ఏమాత్రం పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వచ్చి పరామర్శించిన తర్వాత ఒక్కసారిగా ఉలిక్కిపడినట్టు కనిపిస్తుంది. ఆదివారం గాంధీ దవాఖానకు వచ్చిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఇతర కాంగ్రెస్ నేతలపై నిరుద్యోగులు మండిపడ్డారు. దీంతో ఉద్రిక్తత నెలకొన్నది.

## అరెస్టును ఖండిస్తున్నా: హరీశ్‌రావు



గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌ను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

## ప్రత్యేక బారికేడ్ల ఏర్పాటు

నిరుద్యోగుల ఆగ్రహాన్ని గుర్తించిన పోలీసులు సోమవారం నుంచి గాంధీ దవాఖానను తమ ఆధీనంలోకి తీసుకొని బలగాలను మోహరించారు. లోపలికి వచ్చే మార్గంలో బారికేడ్లు ఏర్పాటుచేసి డాక్టర్లు, సిబ్బందిని మాత్రమే అనుమతిస్తున్నారు. డీసీపీ గిరిధర్ పర్యవేక్షణలో చిలకలగూడ పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

## భారీగా తరలివస్తున్న నిరుద్యోగులు

మోతీలాల్ దీక్షకు రోజురోజుకూ విశాల మద్దతు పెరుగుతున్నది. సోమవారం గాంధీ దవాఖాన ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల పూర్తిగా నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున కనిపించారు. మోతీలాల్‌నాయక్ ఉన్న రెండో అంతస్తులోని ఐఎంసీ వార్డు వద్ద కూడా పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆయనను కలవడానికి ఎవరినీ అనుమతించలేదు. మోతీలాల్ స్పందనను తెలుసుకునేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించింది. ఓపిక కూడగట్టుకొని మోతీలాల్ మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు మీడియాను బయటకు పంపారు.

## విరమించడం లేదు : డాక్టర్ రాజారావు

మోతీలాల్ నాయక్ తన దీక్షను విరమించబోనని పట్టుబడుతున్నారని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు వెల్లడించారు.

## పోలీసుల తీరుపై నిరుద్యోగుల మండిపాటు

మోతీలాల్‌నాయక్ దీక్షపై కొందరు పోలీసుల దుష్ప్రచారంపై నిరుద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు. రహస్యంగా మోతీలాల్ ఆహారం తీసుకుంటున్నాడంటూ నేరుగా మీడియా ప్రతినిధులకే పోలీసులు చేరవేస్తున్నారని తెలిసింది. తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, వాటిని ఉన్నతాధికారులకు కూడా పంపినట్టు అబద్ధాలు చెప్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం స్పందించకపోగా, ఇలా దుష్ప్రచారం చేసి తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో..




గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 ప్రకారం ఎంపిక చేయాలని, గ్రూప్-2లో 2 వేలు, గ్రూప్-3లో 3 వేల పోస్టులు పెంచాలని సోమవారం చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

## వరంగల్‌లో...



డీఎస్సీ పరీక్షలు వాయిదావేయాలని హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న అభ్యర్థులు



పోస్టులు పెంచాలని నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంత్రి కోమటిరెడ్డిని ఘెరావ్ చేస్తున్న నిరుద్యోగులు

# గ్రూప్స్‌లో పోస్టులు పెంచాలి.. డీఎస్సీ వాయిదా వేయాలి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 1: గద్దెనెక్కిన వెంటనే లక్ష ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, వంద రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఇక్కడ బీఆర్‌ఎస్వీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు మాట్లాడుతూ గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 ప్రకారం ఎంపిక చేయాలని, గ్రూప్-2లో 2 వేలు, గ్రూప్-3లో 3 వేల పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా జేఏసీ నేత మోతీలాల్ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం చలించడం లేదని మండిపడ్డారు. గ్రూప్-1, గ్రూపు-2, డీఎస్సీ పోస్టులు పెంచి ప్రిపరేషన్‌కు గడువు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు నిరసన తెలిపారు. మోతీలాల్‌కు మద్దతుగా గ్రంథాలయం నుంచి మెట్టుగడ్డ వరకు ర్యాలీ తీశారు. డీఎస్సీ వాయిదా వేయాలని, పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని కేంద్ర గ్రంథాలయం ఎదుట ఆందోళన చేశారు. నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ముట్టడించారు. మండల సమావేశానికి హాజరై వెళ్తుండగా మంత్రిని నిరుద్యోగులు అడ్డుకున్నారు. నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో అక్కడి నుంచి మంత్రి జారుకున్నారు. నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న మాట్లాడుతూ డీఎస్సీని డిసెంబర్ దాకా వాయిదా వేయాలన్నారు.



సెక్రటేరియట్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గెస్ట్ లెక్చరర్లు

# డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు 50 వేల వేతనం ఇవ్వాలి

- ఆటో రెన్యువల్‌తో కొనసాగించాలి
- పార్ట్‌టైమ్ లెక్చరర్లుగా పేరు మార్చాలి
- గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్
- సెక్రటేరియట్‌లోకి దూసుకెళ్లే యత్నం
- పోలీసుల అడ్డగింత.. సీఎస్‌తో చర్చలు

హైదరబాద్ జూలై 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.50 వేల చొప్పున వేతనం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. ప్రస్తుతం డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఆటో రెన్యువల్‌ను వర్తింపజేయాలని కోరారు. గెస్ట్‌లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసే అవకాశం ఇవ్వాలని సచివాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇక్కడ నేతలు మాట్లాడుతూ 12 ఏండ్లుగా పనిచేస్తున్న తమకు రెన్యువల్ విషయంలో కొత్తగా డెమో నిబంధన విధించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 145 ప్రభుత్వ కళాశాలల్లో 1,600 మంది పనిచేస్తున్న తెలిపారు. పీరియడ్ విధానాన్ని రద్దుచేసి 12 నెలలకు కన్సాలిడేటెడ్ పే ఇవ్వాలని కోరారు. గెస్ట్ లెక్చరర్లు అన్న పదాన్ని తొలగించి పార్ట్‌టైమ్ లెక్చరర్లుగా మార్చాలని, బదిలీ అయినవారిని రీలొకేట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం దౌర్భాగ్యమని, సమస్యలపై మంత్రులకు వినతిపత్రాలు ఇస్తే చెత్తబుట్టల్లో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో అసోసియేషన్ ప్రతినిధులు చర్చలకు వెళ్లారు.